నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, గురువారం 4 జనవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

నీళ్లు ఇవ్వండి మహాప్రభో..

గద్వాల అర్బన్, జనవరి 3 : తాగడానికి నీళ్లు ఇవ్వండి మహాప్రభో.. అంటూ జిల్లా కేంద్రానికి చెందిన 7వ వార్డు ప్రజలు బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ ఇంకా వేసవి కాలం రాలేదు అప్పుడే నీళ్ల కోసం ఇబ్బంది పెడతారా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ ద్వారా ట్యాంకులు నిర్మించి, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి శాశ్వతంగా నీరు అందించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన నెల రోజులకే మిషన్ భగీరథ పైపు లింక్‌ను బంద్ చేశారు. దాదాపు పది రోజులుగా నీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దౌలన్న, కాలనీవాసులు మధు, సుదర్శన్ గౌడ్, సాయిబాబా, అంజి తదితరులు ఉన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

మిషన్ భగీరథకు గడ్డుకాలం

నీటి ఎద్దడి రాకుండా చూస్తాం..

వర్షాలు సరిగ్గా కురవక పోవడంతో కృష్ణానదికి ఆశించిన స్థాయిలో నీళ్లు రాలేదు. దీంతో శ్రీశైలంలో నీటి నిల్వలు గత సంవత్సరం కంటే తగ్గాయి. గతంలో శ్రీశైలం నుంచి రివర్స్ పంపింగ్ చేపట్టి మిషన్ భగీరథకు నీళ్లు అందించారు. ప్రస్తుతం శ్రీశైలంలో గరిష్ఠ నీటి మట్టాలు ఉంచేందుకు విద్యుత్తు ఉత్పత్తి నిలుపుదల కోసం ప్రభుత్వానికి లేఖ రాశాం. ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఎండాకాలంలో మంచినీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం.
- సుధాకర్‌సింగ్, ఈఈ మిషన్ భగీరథ


నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం

- కృష్ణానదిలో తగ్గిన నీటి నిల్వలు
- కనిష్ఠ స్థాయిలో శ్రీశైలం నీటి మట్టాలు
- వేసవికి ముందే మంచినీటి కష్టాలు
- విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేస్తే ఉపశమనం
- ప్రభుత్వానికి లేఖ రాసిన అధికారులు


మిషన్ భగీరథ పథకానికి నీటిని అందించే నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని ఎల్లూరు రిజర్వాయర్

నాగర్‌కర్నూల్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : ఇంటింటికీ నల్లా నీళ్లు అందిస్తున్న మిషన్ భగీరథ పథకానికి రానున్న వేసవిలో నీటి కష్టాలు తప్పేలాలేవు. గత వానకాలంలో సరిగా వర్షాలు కురవకపోవడం, ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురవకపోవడంతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు కళ తప్పాయి. శ్రీశైలం రిజర్వాయర్ వద్ద నీటిమట్టాలు కనిష్ఠ స్థాయికి చేరాయి. ఫలితంగా ఈసారి వేసవి రాక ముందే గ్రామాలు, పట్టణాల్లో మంచినీటి సమస్య ఎదురుకానున్నది. ముఖ్యంగా ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు వికారాబాద్, రంగారెడ్డి పరిధిలోని 19 మున్సిపాల్టీలు, 4,427 గ్రామాలకు మంచినీటి కష్టాలు తప్పక పోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

మిషన్ మంచినీరు..

ప్రజల మంచినీటి కష్టాలను తీర్చాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం 2016 ఆగస్టులో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. ఫలితంగా ఇంటింటికీ నల్లాల ద్వారా శుద్ధజలం ఉచితంగా అందించింది. రెండేండ్ల కిందట ఒకసారి మిషన్ భగీరథకు నీటి సమస్య ఎదురైనప్పటికీ రివర్స్ పంపింగ్ ద్వారా అధికారులు సరిదిద్దారు. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌ను కొల్లాపూర్ మండలం ఎల్లూరులో ఎంజీకేఎల్ఐ కోసం నిర్మించిన రిజర్వాయర్‌కు తరలించడం ద్వారా తాగునీటి సమస్య తలెత్తకుండా చూశారు. తిరిగి ఈ సంవత్సరం మరోసారి మంచినీటి సమస్య ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే చాలా గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య ఎదురవుతున్నది. రెండు, మూడు రోజులకు ఒకసారి నీళ్లు వదులుతున్నారు. వచ్చే ఎండాకాలం నాటికి తాగునీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితి ఉన్నదని మున్సిపల్, పంచాయతీ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలంలో 815 అడుగుల వరకు నీళ్లు ఉంటే తాగునీటికి ఇబ్బంది ఉండదు. ప్రస్తుతం 831 అడుగుల నీటి నిల్వ ఉన్నది. అయితే, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కులు, శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తి కోసం 2,685 క్యూసెక్కులు, ముచ్చుమర్రికి 735 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇలా రోజూ 5,705 క్యూసెక్కుల నీళ్లు శ్రీశైలం నుంచి బయటికి వెళ్తున్నాయి. దీంతో మిషన్ భగీరథ అవసరాలకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రస్తుతం మిషన్ భగీరథకు నీళ్లు అందించే నార్లాపూర్(ఎంజీకేఎల్ఐ) రిజర్వాయర్ సామర్థ్యం 0.35 టీఎంసీలు. కాగా పాలమూరు ఎత్తిపోతల్లో భాగంగా ప్రారంభించిన నార్లాపూర్, అంజనగిరి రిజర్వాయర్ సామర్థ్యం 6.51 టీఎంసీలు. ఈ రిజర్వాయర్ ద్వారా మిషన్ భగీరథకు మంచినీటి సమస్యను తీర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 140 కోట్లతో కాల్వ పనులు కొనసాగుతున్నాయి. కానీ, కృష్ణానదిలో నీటి నిల్వలు లేకపోవడంతో నార్లాపూర్ రిజర్వాయర్‌పైనే మిషన్ భగీరథ నీళ్ల కోసం ఆధారపడాల్సి వస్తున్నది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ సారి ఎండాకాలంలో ప్రజలు నీళ్ల ట్యాంకర్లు, బోరుబావులను ఆశ్రయించక తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ అధికారులు.. శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తిని, ఎంజీకేఎల్ఐకి నీటి విడుదలను ఆపాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు.

రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది..?

- రైతుబంధు డబ్బులు ఎప్పుడు జమచేస్తారు?
- ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్
- పార్లమెంట్ ఎన్నికల కోసమే ప్రజాపాలన దరఖాస్తులు
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట, జనవరి 3 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న రూ. 2లక్షల రుణమాఫీ చేస్తుంది.. రైతులు బ్యాంకుకు వెళ్లి రుణాలు రెన్యువల్ చేసుకోవాలని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలరోజులైనా ఇంత వరకు ఇచ్చిన మాట ఎందుకు నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇంతవరకు రైతులకు రైతుబంధు డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతుబంధు సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వంపై బురదచల్లి తాత్సారం చేస్తుందన్నారు. గ్రామాల్లో కరెంటు కోతలు అప్పుడే మొదలయ్యాయని, జనవరి నుంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెంచి ఇస్తామన్నా ఆసరా పింఛన్లు ఏమయ్యాయన్నారు. ఆరుగ్యారెంటీలు అమలు చేయలేక పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు హడావిడిగా ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి ఏమిటని, రైతుబంధును రైతులు, కౌలు రైతులలో ఎవరికి ఇస్తారో స్పష్టం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తపన తప్పా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే పట్టుదల వారిలో కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ నైజం ప్రజలను నమ్మించి మోసం చేయడమేనని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలతోపాటు హామీలను అమలు చేయాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. నెలరోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీటీసీ తిరుపతయ్య, అమీనొద్దీన్, సర్పంచ్ లోక్యానాయక్, జెడ్పీటీసీ రాంబాబు, కౌన్సిలర్ రమేశ్, కుత్బుద్దీన్, రాజేశ్వర్‌రెడ్డి, రాజారాంగౌడ్, నర్సింహ, బాలరాజు, రేణయ్య, సింగిల్‌విండో చైర్మన్ నర్సయ్య, సతీశ్, తిరుపతయ్య, వెంకటయ్య, సర్పంచ్ శ్రీరాంనాయక్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన హ్యాండ్‌బాల్ జట్లు

జాతీయస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- విశ్రాంత గురుకుల రాష్ట్ర క్రీడాధికారి రమేశ్‌కుమార్
- జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీకి రాష్ట్ర జట్ల పయనం

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 3 : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ రాష్ట్ర జట్లు విజేతగా నిలువాలని విశ్రాంత గురుకులాల రాష్ట్ర క్రీడాధికారి రమేశ్‌బాబు అన్నారు. హర్యాన రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. బుధవారం ఆయన క్రీడాకారులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, జాతీయస్థాయి టోర్నీ క్రీడాకారులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. హ్యాండ్‌బాల్‌లో ఎంతో మంది జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు, అసిస్టెంట్ సెక్రటరీ వేణుగోపాల్, జిల్లా హ్యాండ్‌బాల్ సెక్రటరీ జియాఉద్దీన్, హెచ్‌వోడీ బాలరాజు, కోచ్‌లు అహ్మద్‌హుస్సేన్, పద్మినీగుప్తా, మేనేజర్లు కృష్ణయ్య, శంకర్ ఉన్నారు.

జట్టు వివరాలు..

బాలుర జట్టు : ధన్‌రాజ్‌గౌడ్, మహ్మద్‌అబ్దుల్ జూనేద్, చరిత్‌రెడ్డి (మహబూబ్‌నగర్), బి.రోహిత్ భార్గవరెడ్డి (రంగారెడ్డి), మధురోహిత్, సాయికార్తీక్, పులిరూబి కిరణ్ (కరీంనగర్), పొట్టు సాయి, కె.చక్రధర్(సిరిసిల్ల), కృష్ణ(జయశంకర్‌భూపాలపల్లి), రఫీయొద్దీన్(సంగారెడ్డి), సాయితేజ (వికారాబాద్), విజయగిరి కృష్ణ (జనగాం), బాబు సాహెబ్ (హైదరాబాద్), రాంకుమార్ (మంచిర్యాల), రమేశ్ (సిద్దిపేట), కృష్టయ్య (మేడ్చల్), అంజి (నల్లగొండ), బి.కిరణ్(కామారెడ్డి).

బాలికల జట్టు : సుదీక్ష (జనగాం), బి.జ్యోతి, సంధ్య (వరంగల్), వైష్ణవి (హన్మకొండ), కె.జ్యోతి (నారాయణపేట), శివానీచంద్ర (మహబూబ్‌నగర్), బి.తన్మయి(ఖమ్మం), మీనాక్షి(కొత్తగూడెం), సంజన (హైదరాబాద్), అక్షయ(సిద్దిపేట), వర్ష (నిజామాబాద్), శ్రావ్య (పెద్దపల్లి), నవనీత (నిజామాబాద్), మహిన్ (నల్లగొండ), శ్రీవాణి (నారాయణపేట), గీతా (ఆసిఫాబాద్), రాఘవి (కరీంనగర్).

విద్యార్థి మృతి ఘటనలో నలుగురు సస్పెన్షన్

- విధుల నుంచి ఇద్దరి తొలగింపు

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 3 : జిల్లా మైనార్టీ బాలుర-2 గురుకుల కళాశాలలో బాలుడి మృతి ఘటనలో నలుగురు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును తొలగించారు. ఈనెల 1న మహబూబ్‌నగర్‌లోని బాలుర-2 గురుకుల కళాశాల తరగతి గదిలో అనుమానాస్పదంగా ఇంటర్ విద్యార్థి రాంరెడ్డి (17) ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గురుకులాల రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా తీవ్రంగా స్పందించారు. కళాశాల ప్రిన్సిపాల్ బుషీరా ఫాతిమా, పీజీటీ సాంఘిక శాస్త్రం కిశోర్‌కుమార్, పీజీటీ ఉర్దూ సాలెహాబేగం, జూనియర్ లెక్చరర్ మహ్మద్ ఖదీర్‌ను సస్పెండ్ చేయగా, పీఈటీ క్రాంతికుమార్, సెక్యూరిటీ గార్డు అబ్దుల్ రహమాన్‌ను సర్వీసుల నుంచి టెర్మినేట్ చేశారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర-3 గురుకుల పాఠశాల విద్యార్థి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో మహిళా సెక్యూరిటీ గార్డు మృతి చెందారు. గురుకులాలపై సరైన పర్యవేక్షణ లేని కారణంగా తరుచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలపై గురుకులాల జిల్లా రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ) ఖాజాబహోద్దీన్‌ను వివరణ కోరగా రాష్ట్ర గురుకులాల కార్యదర్శి షఫీవుల్లా జిల్లా గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులతో వీసీ నిర్వహించి సమీక్షించారని, ప్రతి ఉపాధ్యాయుడు, విధి నిర్వహణ సిబ్బంది రెండు గంటల చొప్పున విద్యార్థులను పర్యవేక్షిస్తుండాలని ఆదేశించినట్లు చెప్పారు. సీసీ కెమెరాల నిఘాలో విద్యార్థుల కదలికలపై దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు వివరించారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- పర్ధిపురంలో దరఖాస్తుల స్వీకరణ

అభయహస్తం దరఖాస్తులు స్వీకరిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, జనవరి 3 : నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పర్ధిపురం గ్రామంలో జరిగిన ప్రజాపాలనలో అభయహస్తం దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరిస్తుందని, అర్హులైన పేదలు దరఖాస్తులు అందించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ యూత్ సభ్యులు పర్ధిపురంను గ్రామ పంచాయతీగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే మండలంలోని పులికల్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో ఎంపీడీవో సాయిప్రకాశ్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవన్న, కమిషనర్ నిత్యానంద్, సర్పంచ్ గోవర్ధనమ్మ, ఎంపీవో నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పరిశీలన..

మానవపాడు, జనవరి 3 : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం మానవపాడులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. దరఖాస్తులు సరిపోయినన్ని ఉన్నాయా లేదా అని ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు భారీగా రావడంతో ఎమ్మెల్యే విజయుడు అందరి దరఖాస్తులు స్వీకరిస్తారని సంయమనం పాటించాలన్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం తెల్ల పేపర్ మీద రాసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా మానవపాడులో 1,338, చెన్నిపాడులో 254 దరఖాస్తులు స్వీకరించినట్లు జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి నాగేంద్రం తెలిపారు.

మమ్మల్ని మన్నించండి..

- మా అవసరం కోసమే దొంగతనం చేస్తున్నాం..
- నాగర్‌కర్నూల్ ఐటీఐ కాలేజీలో కాపర్ వైర్లు, మోటర్లు చోరీ
- 'సలార్ సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అంటూ కళాశాల బోర్డుపై హీరోలు ప్రభాస్, అల్లు అర్జున్ పేర్లు రాసిన దొంగలు

నాగర్‌కర్నూల్, జనవరి 3 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జాతీయోన్నత పాఠశాల ఆవరణలోని ఐటీఐ కళాశాలలో గుర్తు తెలియని దుండగులు కాపర్‌వైర్లు, మోటర్లను ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. గత నెల 31వ తేదీన ఐటీఐ కళాశాలలోని ప్రాక్టికల్ సంబంధించిన పరికరాలు, కాపర్ వైర్లు, మోటర్లు, ఫ్యాన్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అదే విధంగా బాలికల జూనియర్ కళాశాలలోని తరగతి గదుల్లో ఉన్న ఫ్యాన్లను సైతం విప్పి అందులోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అయితే వైర్లు, మోటర్లు ఎత్తుకెళ్లిన దుండగులు ఐటీఐ తరగతి గది బోర్డుపై 'సలార్ చూసి ఎంజాయ్ చేయండి' మా అవసరాల కోసమే కళాశాలలో దొంగతనం చేశాం, మమ్మల్ని మన్నించండి, మిగతా సామాన్లు ఇక్కడే వదిలేశాం అంటూ హీరోలు అల్లు అర్జున్, ప్రభాస్ పేర్లు బ్లాక్ బోర్డుపై రాసి వెళ్లారు. కాగా, ఇదే పాఠశాలలో గత నెల 24, 25 తేదీల్లో కూడా చోరీ జరిగిన విషయం తెలిసిందే. వీటిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

నిర్మలకు సావిత్రీబాయిపూలే అవార్డు

ఖిల్లాఘణపురం, జనవరి 3 : మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన నిర్మల రాష్ట్ర స్థాయి సావిత్రీబాయిపూలే అవార్డుకు ఎంపికైంది. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మహిళా నాయకురాలు మణిమంజరి ఆధ్వర్యంలో అవార్డును అందుకున్నారు.

అవార్డును అందుకుంటున్న నిర్మల

పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడలు

- అన్ని క్రీడా పోటీల్లో రాణించాలి
- డీఆర్‌డీవో నర్సింగరావు

నాగర్‌కర్నూల్, జనవరి 3 : దివ్యాంగులు క్రీడల్లో రాణించాలని నాగర్‌కర్నూల్ జిల్లా డీఆర్‌డీవో ప్రాజెక్టు అధికారి నర్సింగ్‌రావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల అధికారిణి వెంకటలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగులు మండల, జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన సీనియర్, జూనియర్ మేల్, ఫీమేల్ క్రీడాకారులు పరుగు పందెం, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, వీల్‌చైర్, పరుగుపందెం, చదరంగం, క్యారం తదితర పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల జిల్లా మానిటర్ కమిటీ సభ్యులు కందనూలు నిరంజన్, రాజశేఖర్, సంఘం నాగర్‌కర్నూల్ పట్టణ అధ్యక్షుడు భీంసాగర్, కొల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నారాయణమ్మ, నిర్మల, లక్ష్మి, శిరీష, బాలపీరుతో డీఆర్డీవో, డీడబ్ల్యూవో, సీడబ్ల్యూసీ, సీడీపీవో, డీసీపీయూ, హ్యూమన్ హబ్, చైల్డ్ హెల్ప్ లైన్, పీఈటీలు పాల్గొన్నారు.

క్యారం, షాట్‌పుట్ క్రీడల్లో పోటీపడుతున్న దివ్యాంగులు

కలెక్టర్ క్రాంతి బదిలీ

- జోగులాంబ గద్వాల కలెక్టర్‌గా బీఎం సంతోశ్

గద్వాల, జనవరి 3 : ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి స్థాన చలనం కలిగింది. సంగారెడ్డి జిల్లాకు ఆమెను బదిలీ చేశారు. క్రాంతి 2021 సెప్టెంబర్ 1న గద్వాల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించగా.. 28 నెలలపాటు విధులు నిర్వర్తించారు. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో సఫలీకృతులై ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఆమె స్థానంలో కొత్త కలెక్టర్‌గా టీఎస్‌పీఎస్‌సీలో అదనపు సెక్రటరీగా పనిచేస్తున్న (2017 బ్యాచ్) బీఎం సంతోశ్‌ను నియమించింది.

బీఎం సంతోశ్

జోగులాంబ జోన్ డీఐజీగా జోయెల్ డేవిస్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 3 : జోగులాంబ జోన్-7 డీఐజీగా జోయెల్ డేవిస్ నియమితులయ్యారు. 2010 బ్యాచ్‌కు చెందిన డేవిస్ ప్రస్తుతం హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. బుధవారం జరిగిన బదిలీల్లో ఆయన జోగులాంబ జోన్-7 డీఐజీగా బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎల్ఎస్ చౌహాన్ రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ అయ్యారు.

జోయెల్ డేవిస్